# కొన్ని క్షణాలు!

సింగరాజు లింగమూర్తి



"నేను వెళుతున్నాను..." అంది రాజ్యం.

సూర్యం ఆమె ముఖంలోకిచూసి ఊరుకున్నాడు.

"ఏమిటలా చూస్తారు? ...వెంకులు మీ దగ్గరే ఉంటాడుగా కనిపెట్టుకొని...మరింక వెళ్ళిరానా - టైం అవుతున్నది..." మళ్ళీ రాజ్యమే అంది.

"ఆత్మీయులకంటే ఎక్కువగా చూస్తారేమిటి నౌకర్లు?" నిష్ఠూరంగా అన్నాడు సూర్యం.

రాజ్యం అతని ముఖంలోకి చూసింది. చిరునవ్వు తెచ్చుకొని. సూర్యం దగ్గరకు వెళ్ళి కాపు సరిచేస్తూ అంది. నాకు తెలుసు. మీకు కోపం వచ్చిందని నేను మీ దగ్గరే కూర్చుంటే నన్ను చూసి మీరు మిమ్మల్ని చూసి నేను గతాన్ని తలచుకొని మనసుల్లో కుళ్ళిపోవడమేగా...డాక్టర్ మీకు మానసికమైన విశ్రాంతి ఎక్కువగా కావా లన్నారు. అందుకే కొన్ని గంటలైనా మీకు దూరంగా ఉండ వచ్చునని ఉద్యోగంలో చేరాను." అంది.

'నీవు ఎదుటఉంటేనే నాకు తృప్తిగా వుంటుంది రాజ్యం....నా చివరి క్షణాల్లోనైనా నీవు దగ్గర ఉంటావేమోనని భయం .. వద్దు రాజ్యం వద్దు ఆ ఉద్యోగం మానెయ్యి. మనకేం తక్కువైందని చెప్పు"...అనునయంగా అన్నాడు సూర్యం.

"మీ కెలా చెప్పాలో నాకు అర్థం కావటం లేదు. ఉద్యోగంలో చేరిన రెండోరోజే మానేస్తానంటే ఏం బాగుంటుంది?"

"నాతో చెప్పకుండా ఉద్యోగంలో చేరడం బాగుందికదూ?" కోపంగా అన్నాడతను.

రాజ్యం అతని కళ్ళల్లోకి లాలనగా చూసింది అతని మీదికి ఒరిగి చెంపలు రాస్తూ 'మీరు చిన్న పిల్లాడిలా కోపం తెచ్చుకుంటే ఎలా చెప్పండి? వ్యాపారం చూస్తే మందకొడిగా ఉందా? మీ జబ్బు చూస్తే ఇలా ఉందా. ఉన్నదికదుక్కు తింటుంటే ఎన్నాళ్ళు జరుగుతుంది చెప్పండి.. సరే. వస్తా టైంఅయింది". అని రాజ్యం మంచంమీదనుంచి లేచి. "వెంకులూ, వచ్చి అయ్యగారిదగ్గర కూర్చో" అని కేకేసి గదిదాటి వెళ్ళిపోయింది.

బరువుగా నిట్టూర్చాడు సూర్యం.

"హుఁ...ఎంత మారిపోయింది రాజ్యం...నాకీ జబ్బు రాకపోతే ఇలాఉండేదా"...అనుకునేప్పటికి

గిలు నెళ్ళముందు కదులాడింది.

సూర్యం వస్తుతః కాస్త ఉన్నవాడు. పెళ్ళయిన కొత్తలోనే వ్యాపారం ప్రారంభించాడు బాగా కలిసివచ్చింది. రాజ్యం వచ్చిన వేళా విశేష మనుకున్నారు. అప్పటినుంచి ఆమె మీదగల ప్రేమాభిమానాలు గౌరవం మరింత ఇనుమడించాయి.

రాజ్యం కాపురానికి వచ్చి నాలుగేళ్ళయినా సంతానం కలుగలేదు. ఆమె మనస్సులో ఏమను కునేదో గాని, సూర్యానికి మటుకు పిల్లలు కలుగక పోవడం ఎంతో లోటనిపించేది. ఆ మాటే ఒక సారి రాజ్యంతో అంటే— "ఆఁ- ఇప్పటినుంచీ పిల్లలు ఎందుకు లెద్దురూ— హాయిగా ఉండకుండా..." అంది.

మరింకెప్పుడూ ఆమె యెదుట ఆ ప్రస్తావన తేలేదు సూర్యం.

సూర్యానికి దూరపు బంధువులు తప్ప దగిర వాళ్ళెవరూ లేరు.

"ఇంట్లో నాకేం తోచడంలేదండీ! సిన్మా పాటలే వింటూ రేడియోముందు కూర్చోవాలంటే విసుగేస్తున్నది. ప్రైవేటుగా బి. ఏ. చదువుతా" అంది రాజ్యం.

సరేనని సూర్యం ఆమెకు ఒక ట్యూటర్ని కూడా ఏర్పాటు చేశాడు.

ప్రైవేటుగా చదివే, రాజ్యం బి. ఏ ప్యాసైంది.

హఠాత్తుగా సూర్యానికి జబ్బు చేసింది. నెల రోజులు గడచినా డాక్టర్లు ఇది ఫలాన జబ్బని నిర్ణయించలేకపోయారు.

మందులదారి మందులది, జబ్బుదారి జబ్బుదిగా ఉంది డాక్టర్లు మారుతున్నారు. మందులు, ఇంజక్షన్లు మారుతున్నాయి. జబ్బు ముదురుతున్నదేగాని తగ్గడం లేదు. డబ్బు మాత్రం నీళ్ళ ప్రాయంగా ఖర్చవుతున్నది.

ఐదు నెలలు అయ్యేప్పటికి వ్యాపారం నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో ప్రాలుమాలికఎక్కువైంది. ఎవరి కందింది వారు స్వాహా చేయడం ప్రారంభించారు.

రాజ్యం ఇంటి వ్యవహారాలు చూసుకోడం సూర్యాన్ని కనిపెట్టుకొని ఉండటంతోనే సరిపోతున్నది ప్రయత్నించినా వ్యాపార సంబంధమైన వ్యవహారాలు ఆమెకు అంతుపట్టేవికావు వ్యాపారం దెబ్బ తినడమేకాక నష్టంకూడా వస్తున్నది.

సూర్యానికి, స్నేహితుడు శేఖరంఅంటే ఎంతో నమ్మకం. అతడు తరచుగా వచ్చి సూర్యాన్నిపరామర్శించడం, సలహా లివ్వడం, ఏ పనైనా చేసుకురావాలంటే వెళ్ళడం — ఇలా ఎంతో సహాయంగా ఉంటున్నాడు. రాజ్యం దగ్గరకూడా శేఖరానికిచాస్త చనువేర్పడింది. పరిచయంపెరిగడంవల్ల రాజ్యంలో అతనంటే వెనుకటి బెరుకుతనం పోయి కలుపుగోలుగా ఉంటున్నది.

వ్యాపార సంబంధమైన వ్యవహారాల్లో శేఖరం సహాయాన్ని అర్థించాడు సూర్యం. 'నేను చూసుకుంటాలే, నీవు నిశ్చింతగా వుండు' అని హామీ ఇచ్చాడు శేఖరం.

రోజులు, నెలలు గడుస్తున్నాయి. సూర్యం మరి కుంటానికి అతుక్కుపోయాడు.

రాజ్యానికి మరీ అలసట, అవస్థ అవుతున్నదని చెప్పి సూర్యం మాటప్రకారమే శేఖరం ఒక నౌకర్ను ఏర్పాటు చేశాడు.

వెంకులే సూర్యానికి కావలసిన సపర్యలన్నీ చేస్తున్నాడు

రాజ్యంలో దిగులు, భయం ఎక్కువయ్యాయి.

"ఈయనేమైనా అయితే ఎలా బ్రతకడం?" అని విచారించేది.

ఆమె మనోభావాలను సూర్యం చదవగలిగేవాడు

ఆమె మనస్తాపం తగ్గడానికని అయితేనేం కాస్త తనకుంచి రిలీఫ్ కలగడానికని అయితేనేం - సినిమాలకు సాంస్కృతిక ప్రదర్శనలకు వెళ్ళమని ప్రోత్సహించేవాడు సూర్యం

నీకు వీలైనప్పుడు రాజ్యాన్ని ఎక్కడికైనా తీసుకువెళ్ళు. నా అవిటితోపాటు తీసుకువెడుతుండు శేఖరం లేకపోతే ఆమెకు మరీ పిచ్చెక్కి పోతోంది" అని స్నేహితుడికికూడా చెప్పాడు.

సూర్యాన్ని ఏ డాక్టరు దగ్గరకైనా ఆసుపత్రికైనా తీసుకు వెళ్ళాల్సివస్తే రాజ్యం - శేఖరాలే తీసుకు వెళ్ళేవారు.

భార్యతో కలిసి సినిమాకో, మరే నాటక ప్రదర్శనలకో వెళ్ళేప్పుడు శేఖరం రాజ్యాన్ని కూడా తీసుకు వెళ్ళేవాడు. ఒక్కోసారి ఇష్టంలేకనో అనారోగ్యం వల్లనో శేఖరం భార్యరానంటే 'పోనీ. మనం పోయొద్దాం రండి. ఆమెకు ఇబ్బంది పెట్టడందేనికి' అనేది రాజ్యం, ఇంకా లేకుండా ఆమె పోదామంటుంటే శేఖరం ఎలా కాదంటాడు?

కలిసి మెలసి తిరుగుతుండడంవల్ల క్రమంగా ఇద్దరిలోనూ ఆకర్షణలు పెరిగాయి ఇద్దరిమధ్య చనువు చొరవ ఎక్కువైనాయి. వాళ్ళిద్దరూ అరమరికలూ లేకుండా మాట్లాడుకొని తిరుగుతుంటే తెలియని వాళ్ళకు భార్యాభర్తలేమో అనిపించేది.

అంత సన్నిహితంగా మెలగుతుండడంవల వాళ్ళకు తెలియకుండానే ఇద్దరిలోనూ కోర్కెలు కాల్చివేసేద అదిపైకి పొక్కనీయని విచిత్ర మనఃస్థితి ఇద్దరిలోనూ ఏర్పడింది

ఇంట్లో మంచంమీద ఉన్నట్టుండేది రాజ్యానికి. అది భర్త పడుతున్న బాధను చూడలేకనని సరిపుచ్చుకునేది. శేఖరానికి వీలులేని సమయాలలో స్నేహితురాండ్ర ఇండ్లకు ఏదోసాకు చెప్పుకొని వెళ్ళేది.

క్రమంగా వంటపని కూడా వెంకులుకే అప్పచెప్పింది రాజ్యం

తెలిసినవాళ్ళలో గుసగుసలు ప్రారంభమైనాయి రాజ్యం - శేఖరాల మీద కథల్లి చెప్పుకునేవారు అవి సూర్యం చెవిదాకా వచ్చాయి మొదట్లో సూర్యం అవేం నమ్మలేదు.

"మనవిచ్చి మన ఇబ్బందుల్లో రాజ్యం ప్రాణ స్నేహితుడైన శేఖరాలగురించి అలా ఊహించడం మహాపాపం" అనుకున్నాడు

అప్పుడప్పుడు సూర్యాన్ని చూడటానికి వచ్చే పరిచయస్థులు స్నేహితులు శేఖరాన్ని గురించి వ్యంగ్యంగా ఏదో అనేవారు. పరోక్షంగా రాజ్యాన్ని గురించి చెప్పిచెప్పనట్టు తమాషాగా మాట్లాడేవారు వాటిని గురించి అంతగా పట్టించుకొనేవాడు కాడు సూర్యం.

ప్రతి వ్యక్తిలోనూ, ఏదో ఓ సందర్భంలో హృదయ దౌర్బల్యం ఏర్పడుతుంది. అందులో జబ్బులో ఉండి, కృశించిపోతున్న సూర్యంలో అతనికి తెలియకుండానే రాజ్యం - శేఖరాల మీద అనుమానం తొంగి చూసేది. ఆ సమయంలో అతని యెదుట రాజ్యం - శేఖరాలు మామూలుగా ఎప్పటిలాగే మసలినా అదేదో ఎబ్బెట్టుగా అనిపించేది అనుమానం బలపడేది.

'నా కెలాగో ఉంది రాజ్యం - పోనీ ఇవ్వాళ సినిమాకు వెళ్ళకపోతేనేం?" అన్నాడు సూర్యం ఒకసారి.

'మామూలేగా ... ఆ పిక్చర్ ఇవ్వాళతో ఆఖరుట. అందులో మంచి పాటలుకూడా ఉన్నాయి. శేఖరంగారు టిక్కెట్లుకూడా తెచ్చారు." అని బయలుదేరి వెళ్ళింది రాజ్యం.

దానితో సూర్యంలో అనుమానం ధృవపడింది. అది బయటకు వెళ్ళగ్రక్కలేక పోయేవాడు.

రాజ్యం అంత చొరవగా, సన్నిహితంగా ఉండడంవల్ల శేఖరంలో కోరికలు నాలుకలు సాచాయి. సూర్యానికి ఆమెను వీలైనంతవరకు దూరంగా ఉండేట్టు చేస్తే రాజ్యానికి తనమీద మరింత మోజు కలగవచ్చు అనుకున్నాడు శేఖరం. ఆమె ఉద్యోగంలో చేరడానికి శేఖరం ప్రోత్సాహం కూడా తక్కువైందేంకాదు.

'ఒకొక్కక్షణం ఎంతో విలువైంది రాజ్యం. మనం ఎంత చదువుకున్న వాళ్ళమయినా ఒక్కోసారి అజ్ఞానంలో పడతాం. విలువలను విస్మరిస్తాం... రాలిన క్షణాలను ఏరుకోగలమా చెప్పు రాజ్యం." ఒకసారి ఏదో సందర్భంలో అన్నాడు సూర్యం.

'ఏమిటో మీరు వేదాంత ధోరణిలో మాట్లాడుతున్నారు - నాకేం అర్థంకావడంలేదు.' నవ్వుతూ అంది రాజ్యం.

ఇంక అంతకంటె చెప్పలేక 'చివరికి మనందరికీ అదే శరణ్యం రాజ్యం!" అన్నాడతను.

* * *

'పాలు తాగండి బాబూ!" అని వెంకులు గ్లాసుతో వచ్చి పలుకరించేప్పటికి సూర్యం ఆలోచనలు చెదిరిపోయాయి.

వెంకులు సహాయంతో పాలుతాగాడు సూర్యం. అతని మూతి తుడిచి.. వెంకులు గ్లాసు తీసుకొని వెళ్ళాడు

నా పేరితో నాకన్నె కొడుతున్నట్లయింది పరిస్థితి. స్నేహితుణ్ణి మనసారా ప్రేమించిన భార్యను నమ్మాను. హుం... కాని వాళ్ళు చేసిందేమిటి? నా నమ్మకాన్ని వమ్ముచేశారు వాళ్ళకు నేనిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకున్నారు... వాళ్ళెట్లా తిరిగినా ఏంచేసినా మంచంలో పడున్న వాడికేం తెలుస్తుందిలే అనుకున్నారు... రేపు నేను కన్నుమూస్తే యథేచ్ఛగా ఇంట్లోనే వాళ్ళ కామ కలాపాలు సాగిస్తారేమో ఛీ ఛీ ఇవన్నీ చూస్తూ ఎలాభరించను ఎలా బ్రతకను? రోగంతో నరక యాతన పడు

తున్నది ఎందుకు మనస్సును ఇలా చిత్రవధ చేస్తున్నావు భగవాన్ అన్న ఆలోచనలతో ఊగి పోతున్నది అతని మనస్సు. కోపం, అసూయ, అవమానం రేగి అతణ్ణి ఉద్రేక పరుస్తున్నాయి. ఇక ఆలోచించలేక కళ్లుమూసుకున్నాడు కళ్ళంటే మూసుకున్నాడు కాని మనస్సో?...

మళ్ళీ కళ్ళు తెరిచాడు. "వెంకులూ ..' నెమ్మదిగా పిలిచాడు.

వెంకులు మంచందగరకువచ్చి 'ఏంటి బాబూ" అన్నాడు.

బాధ ఎక్కువగావుంది వెంకులూ...మాత్రలు అయిపోయినట్టున్నాయి. ఓ కాగితంముక్క ఆ కలంతే రాసిస్తాగాని డబ్బుతీసుకువెళ్ళి తొందరగా తీసుకురా.' అన్నాడు,

వెంకులు కాగితం, కలం అందించాడు. పక్కకు ఒత్తిగిలి పడుకునే కాగితంమీద ఏదో రాశాడు సూర్యం. దిండుకిందవున్న అయిదు రూపాయల నోటు తీసుకొని వెళ్ళాడు వెంకులు

'అమ్మా!...' అంటూ కళ్ళుమూసుకున్నాడు సూర్యం

* * *

సాయంత్రం ఆఫీసు వదిలేవేళకు శేఖరం రాజ్యానికి ఎదురువెళ్ళి "కొత్తపిక్చర్ రిలీజైంది - వెడదామా," అన్నాడు అంగీకారంగా తలూపింది రాజ్యం.

హోటల్లో టిఫిన్, కాఫీలు పూర్తిచేసుకొని రోడ్డుమీదికివచ్చి పక్కపక్కగా నడుస్తున్నారు.

ఇవ్వాళ రాజ్యం వ్యవహారమేమిటో తేల్చుకోవాలి. నలుగురినోళ్లలో ఎలాగూపడ్డాము - ఏమీ జరక్కుండానే. రాజ్యానికి ఇష్టం లాగానేవుంది .. నేనే ధైర్యంచేయలేక పోతున్నాను, ఎంతైనా ఆడది బైటపడదుగా. ఈమె మటుకేం చేస్తుంది. పరిస్థితి అలా వచ్చింది. నలుగురి గుసగుసలూవింటూ కూడా నాతో తిరుగుతున్నదంటే ఇష్టం ఉందనే అనుకోవాలి ..' అని ఆలోచిస్తున్నాడు శేఖరం.

'ఇతనిలో ఏ ఆకర్షణ శక్తి నన్నిలా లాక్కుపోతున్నది? మొన్న మటుకు మొన్న పక్కింటావిడ పని మనిషితో అన్నమాటలు మనస్సును ఎంత బాధ పెట్టాయి ' మొగుడు మంచంలో పడుంటే కులుకుతూ పరాయివాడితో సినిమాలకూ, షికార్లకూ పోతుందేం? ఏమిటో ఆ విరగబాటు. నలుగురూ ఏమనుకుంటారోనన్న సిగ్గైనా లేదు...

పక్కింటావిడ మాటలు మళ్ళీ ప్రతిధ్వనించాయి.

నేనేం చేయను. ఆయనేగా వెళ్ళమని ప్రోత్సహించేంది. అయినా మేమేం తప్పుచేయనప్పుడు ఒకరనే మాటల్ని ఎందుకు లక్ష్యపెట్టాలి? ఒకరికి ఎందుకు భయపడాలి? ఈ విధమైన మానసికానందమైనా లేకపోతే జీవితం మరీ బోరెత్తి పోదూ " అని ఆలోచిస్తున్నది రాజ్యం.

మామూలు టిక్కెట్లకు బుకింగ్ అయిపోవడం వల్ల శేఖరం బాక్స్ టిక్కెట్లు తెచ్చాడు.

సినిమా జరుగుతున్నది. శేఖరం రాజ్యం భుజంమీద చెయ్యి వేశాడు. ఆమె సినిమా ధ్యానలో గమనించిందో. లేదో ఒకవేళ గమనించినా ఉపేక్షించిందేమో ఆమె వారించక పోయేప్పటికి. నడుంచుట్టేసి దగ్గరకు తీసుకుంటున్నాడు శేఖరం. రాజ్యంలో అణగారిన కోరికలు అతని స్పర్శతో పెకిల్లుమన్నాయి. మత్తుగా అతనివైపు చూసింది. శేఖరం ఆమె కాటుకకళ్ళల్లోకి చూస్తూ ముద్దుపెట్టుకోబోయాడు. అంతలోనే ఆమెలో వివేకం మేల్కొంది. అతణ్ణి దూరంగా నెడుతూ 'ఏమిటిది? ... చనువుగా మీతో తిరుగుతున్నాను కదా అని అపార్థం చేసుకుంటారేం?" అని పక్కకు జరిగింది.

'ఊరికే బెట్టుచేయకోయ్ ... నీకు మాత్రం ఇష్టంలేదూ మనస్సులోని కోర్కెలు ఎంతకని చంపుకుంటావ్ ... ఏదీ ...' అంటూ శేఖరం సీటులోంచి లేవబోతున్న రాజ్యాన్ని ఒళ్ళోకి లాక్కోబోయాడు.

'ఛీ - మీ మగస్వభావం పోనిచ్చారుకాదు ..." అతణ్ణి విదలించుకొని చరచరా బయటకు వచ్చి రిక్షా ఎక్కింది రాజ్యం

జరిగింది తలచుకుంటే ఒళ్ళంతా కంపరమెత్తింది రాజ్యానికి. కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ఆ కన్నీళ్ళల్లో సూర్యం రూపం కదిలింది.

'ఒక్కొక్క క్షణం ఎంతో విలువైంది రాజ్యం! మనం ఎంత చదువుకున్నవాళ్ళమయినా ఒక్కోసారి అజ్ఞానంలో పడతాం. విలువలను విస్మరిస్తాం ...రాలినక్షణాలను ఏరుకోగలమా చెప్పురాజ్యం '

ఒకప్పుడు సూర్యం అన్న మాటలు ఆమె కర్ణపుటాల్లో గింగురు మంటున్నాయి

"నమ్మిన స్నేహితుడికి ఎంత అపకారం తలపెట్టాడు శేఖరం ... నా ప్రవర్తనే అతనికా బుద్ధి పుట్టించిందేమో? దైవం సమయానికి మనోనిగ్రహం కలిగించాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే నే నేమైపోయేదాన్నో ... దేవుడులాంటి భర్తకు ఎంతద్రోహం జరిగిపోయేదో" అనుకుంది.

ఇంటిముందు రిక్షాదిగి వడివడిగా భర్త గదిలోకి వెళ్ళింది. సూర్యం మంచంమీద కళ్ళుమూసుకొని పడున్నాడు

'ఏమండీ — ఏమండీ..." అని పిలుస్తూ మంచం దగరకు వెళ్ళింది రాజ్యం.

అతను పలకలేదు. కళ్ళెత్తికూడా చూడలేదు.

'ఇంత ఆలస్యంగా వచ్చానని కోపం వచ్చిందేమో." అనుకుంది రాజ్యం.

'నిద్దరపోతున్నారేమో అమ్మగారూ. ఇందాక నేను పిలిచినా పలకలేదు మధ్యాన్నం బాధెక్కువగా ఉంది. మాత్రలు తెమ్మని చీటీ రాసిస్తే తెచ్చానండి. అవి వేసుకున్నాక బాధ తగ్గి నిద్దర పట్టిందేమో... గదిలోకివచ్చి చెప్పాడు వెంకులు.

"మాత్రలు ఇంట్లోనే ఉన్నాయిగా. మళ్ళీ ఎందుకు తెప్పించారు...ఏదీ. ఆ చీటీ..." అంటూ మళ్ళీ సూర్యం ముఖంలోకిచూసి "ఏమండీ...ఏమండీ నేను వచ్చాను.—ఒక్కసారి కళ్ళుతెరవండి... మీకు కోపంవస్తే ఎలా బతకను ... అంటూ అతణ్ణి కుదిపింది. ఏమిటోగా అనిపించింది. గుండె దడదడ కొట్టుకుంది. కళ్ళల్లోనీళ్లునిండాయి,

"చీటీ యిదిగోనమ్మగోరూ..." అని వెంకులు ఆమెచేతికందించాడు.

ఆందోళనగా ఆ చీటీనిచూసి "అయ్యో — ఎంతపని చేశారండీ...నన్నేంచేసి పోయారండీ? పాపిష్టిదాన్ని ... చివరిక్షణాల్లో మీ దగ్గర లేకపోయాను...మనసులో ఇంత అనుమానం పెంచుకున్నారని ఎప్పుడూ అనుకోలేదండీ...' అని శోకిస్తూ రాజ్యం, సూర్యం పాదాంమీద వాలిపోయింది.

★

